# మూర్ఖపు  హాన్లు

"ఒరేయ్! తమ్ముా, రేపు మీ బడికి మెడికల్ చెకప్ చేయిద్దామనుకొంటున్నాను. పనిలోపని, మరదల్ని కూడా పంపిస్తావా" అడిగాడు సుందరం తమ్ముడు ప్రకాశాన్ని.

"నాకు ఈ చెకప్‌లు నచ్చవు. వాటిమీద గురిలేదు. ఏది ఎలా జరగాలో ఆలా జరుగుతుంది" విసుగ్గా అన్నాడు ప్రకాశం.

"అలా కాదురా' స్త్రీ గర్భవతిగా వున్నప్పుడు వైద్య పరీక్ష చేయించాలి. ఏవన్నా కాంప్లికేషన్స్ వున్నట్లయితే, సర్దుకోవటానికి మందులు ఇస్తారు. దీనివల్ల తల్లికి కులాసాగా వుంటుంది." పుట్టే బిడ్డకూడా ఆరోగ్యంగా ఉండటానికి అవకాశం ఉంటుంది.

"ఏమయినా, నాకు ఇష్టంలేదురా, మమ్మల్ని ఇలా వదిలేయ్.''

"సరేలేరా, నీ ఇష్టప్రకారమే చేయి."

మూర్ఖుడు, చదివాడు ఏంలాభం. అనుకొన్నాడు సుందరం తమ్ముడు ప్రకాశం గురించి.

''అమ్మా, నీ కోడల్ని రేపు డాక్టరు దగ్గరకి తీసుకెళ్ళి పరీక్షచేయిద్దామనుకొంటున్నాను. అప్పుడే నాలుగోనెల నడుస్తోంది. అవసరమయితే మందులు ఇస్తారు. దీనివల్ల కులాసాగా యుంటుంది. పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా వుండటానికి అవకాశం వుంటుంది" అన్నాడు సుందరం తల్లియొ భోజనం చేస్తూ.

"నీది మరీ విడ్డూరంరా. ఈ పరీక్షలు అవీ అనవసర ప్రయాస. డబ్బు దండుగ కూడాను. అయినా, నాకు తెలీకడుగుతాను, ఏం పరీక్షలు చేయించుకొని, టానిక్కులు, మందులు తిని మిమ్మలందర్ని కన్నానురా. ఏం! మీరందరు ఆరోగ్యంగాలేరా?... ఈ చదువులు మిమ్మల్ని పాడుచేశాయి. ప్రతిదానికి డాక్టర్లు, మందులు..."

''అలాగేనమ్మా; నీవు చెప్పినది సబబుగా వుంది. అలాగే చేస్తాను అయినా నీ మాట కాదన్నదెప్పుడు."